క్లుప్తంగా

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ఆహ్లాదం పంచే సబ్బితం జలపాతం తదితర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమాన్ కోరారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పెద్ద చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దేలా ప్రత్యేక చొరవ చూపాలని విన్నవించారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

రామగిరి(ముత్తారం): సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని, ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంలకు సమాచారమందించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలు, షీటీం, గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంథని సీఐ బొల్లంపల్లి రాజుగౌడ్, ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

షీటీం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్: మహిళలు, విద్యార్థులకు రక్షణ కల్పించడానికి పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీటీం సేవలను మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని షీంటీం సభ్యులు అన్నారు. రొంపికుంట ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు షీంటీం సేవలపై అవగాహన కల్పించారు. టీం సభ్యురాలు స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జి మల్లయ్య, సభ్యుడు సురేశ్, హెచ్‌ఎం నిర్మలజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తులపై అవగాహన

రామగిరి(ముత్తారం): ఎస్‌బిఎఫ్‌టీఈఎం ఆధ్వర్యంలో ముత్తారం గ్రామంలో రైతులు, విద్యార్థులకు సోమవారం ఆహార ఉత్పత్తులపై టీమ్ లీడర్ జీవానందన్ దురైసామి అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ డాక్టర్ విమల్ పంట్, ప్రాజెక్టు ఆఫీసర్ సహిల్‌సింగ్, ఫుడ్ టెక్నికల్ ఆఫీసర్ బి.ప్రమోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పూదరికి సన్మానం

రామగిరి: సెపక్ తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన నాగెపల్లి గ్రామానికి చెందిన పూదరి సత్యనారాయణను సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

పెద్దపల్లిరూరల్: నిరుపేద కుటుంబాలకు చెందినవారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ గణేశ్ కోరారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ వేణును కలిసి వినతిపత్రం అందించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల: కనగర్తి గ్రామంలో ధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ డబ్బుల జమకు కృషి చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆళ్ల సుమన్‌రెడ్డి, మూల ప్రేంసాగర్‌రెడ్డి, చొప్పరి రాజన్న, ఉడిగె సదయ్య, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు అందజేయాలి

ఎలిగేడు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య(స్కావెంజర్) కార్మికులుగా పని చేస్తున్న వారికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారికి అధ్యక్షుడు కవ్వంపల్లి నారాయణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వేతనాలు అందేలా చూడాలని కోరారు. లింగయ్య, బొడ్డుపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలను సన్మానించాలి

కమాన్‌పూర్: ప్రజాపాలన విజయోత్సవాలు, భారత రాజ్యాంగ దినోత్సవాలను పురస్కరించుకొని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అత్యధిక కూలి పనులు చేసిన కూలీలు, గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్, వన నర్సరీల్లో మొక్కల పెంపకంలో బాగా పని చేసిన వాచ్‌మెన్లను సన్మానించాలని డీఎల్‌పీవో సతీశ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీవో భాస్కర్, ఏపీవో లావణ్య ఉన్నారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ నిర్మాణం కోసం విలువైన భూములు, నివాస స్థలాలను అప్పగించిన భూనిర్వాసితులకు కొత్త ప్రాజెక్టు నిర్మాణంలో న్యాయం చేయాలని భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

రైతుల పక్షపాతి సీఎం

కాల్వశ్రీరాంపూర్: సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించి సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రాజమల్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య అన్నారు.

యాసంగి సాగు షురూ



పెద్దాపూర్ వద్ద మొలక అలుకుతున్న రైతు

- మొదలైన వరినారు పనులు
- మొక్కజొన్న పండించేందుకూ అన్నదాతల సన్నద్ధం
- చలి తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

జూలపల్లి: వరి కోతలు చివరి దశకు చేరుతున్నాయి. ఇదే సమయంలో కొందరు రైతులు వరినారు పోస్తున్నారు. వ్యవసాయ బావులు, బోర్లు, కాలువల ఆధారంగా నారు పోయడంతో నీటి తడులు ఆశించిన మేరకు అందుతున్నాయి. కొందరు నారు పోస్తుండగా.. మరికొందరు ఇప్పటికే నారు పోయడంతో వడ్లు మొలకెత్తాయి. అయితే, నాణ్యమైన, అనుమతి పొందిన విత్తనాలే వాడాలని, చలి తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలి తీవ్రతతో వరి నారు ఎదుగుదలలో లోపం, పసుపు రంగులోకి మారి చనిపోవడం లాంటివి ఉంటాయి. దీని నివారణకు పగలు వెచ్చని నీరు పెట్టాలని, సాయంత్రం నీటిని తొలగించి ప్లాస్టిక్ కవర్ కప్పి ఉదయం తొలగించాలని వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. జింక్ లోపం ఉంటే జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలని, కాండం తొలిచే పురుగు ఆశిస్తే కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాలని అన్నారు. నారు ఆరోగ్యంగా ఉండేందుకు యూరియాలో కార్బండిజమ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. చలి అధికంగా ఉంటే అగ్గి తెగులు సోకకుండా ట్రైసైక్లోజెల్ చల్లాలని పేర్కొన్నారు.

13,400 ఎకరాల్లో సాగు..

- వివిధ గ్రామాల్లో ఈసారి సుమారు 13,400 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. పత్తి చివరి దశకు చేరడంతో ఆ పంటను తొలగించి మొక్కజొన్న వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

వరి కొయ్యలు కాల్చొద్దు



వరి కోతలు పూర్తయ్యాక మిగిలిన కొయ్యలను కాల్చితే నేలలోని పోషకాలు నశించిపోతాయి. భూసారం తగ్గిపోతుంది. దిగుబడి పడిపోతుంది. అందుకే రైతులు వరి కొయ్యలను పొలంలోనే కలియ దున్నితే భూసారం వృద్ధి చెంది అధిక దిగుబడి వస్తుంది.

– ప్రత్యూష, ఏవో

లీకేజీని అరికట్టండి



సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీరాంపూర్ రోడ్డు సమీపంలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపైకి నీరు వచ్చి బురదవుతోందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. లీకేజయిన నీరు తిరిగి పైప్‌లైన్‌లోకి వెళ్తోందని, దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జావెలిన్ త్రోలో ప్రతిభ

ఖేల్

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో భాగంగా జావలిన్ త్రోలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అరబిందో కాకతీయ పాఠశాల విద్యార్థి మంథని వర్షిత్ ఎంపికయ్యాడు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన వర్షిత్‌ను, పీఈటీ మాచర్ల సాయికుమార్‌ను పాఠశాల కరస్పాండెంట్ ఆర్‌పీ రమణారావు, డైరెక్టర్ మణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటే పోటీల్లో..

గోదావరిఖనిటౌన్: కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2024, సీనియర్ సినీ హీరో రెబల్ స్టార్ కృష్ణంరాజు మెమోరియల్ కప్ పోటీల్లో స్థానిక స్పెక్ట్రా పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డి.జేమ్స్ గోల్డ్ మెడల్, పి.శ్రీరిషి సిల్వర్ పతకాలు సాధించారు. రెడ్ డ్రాగన్ కరాటే ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు కరాటే మొండయ్య, కోచ్ క్రాంతికుమార్, పాఠశాల కరస్పాండెంట్ న్యాతని సాయిలీల, డైరెక్టర్ శ్యామ్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌కు అభినందన

గోదావరిఖనిటౌన్: మహారాష్ట్రలో రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో ఇటీవల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ మామిడి రాహుల్ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా రాహుల్‌ను కాలేజీలో సోమవారం అభినందించారు. ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.సాంబశివరావు, అధ్యాపకులు ఎం.నరేశ్, డి.కిరణ్మయి, డాక్టర్ సుబ్బారావు, బి.తిరుపతి, పి.సవిత, శారద, శ్రీదేవి, శంకరయ్య, ఉషారాణి, రామకృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక

రామగిరి: భారత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ 2024కు సెంటినరీకాలనీ వాణి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుడు ఎంపికైనట్లు కరస్పాండెంట్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయున్ని అభినందించారు. 9వతరగతి విద్యార్థులు జాగృత్, రినేశ్, రిషికుమార్ పాల్గొంటారన్నారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు దూసి కౌండిన్య ఫిజిక్స్ ఎ రౌండ్ అజ్ అనే అంశంపై ఉపన్యసించనున్నాడని తెలిపారు.

మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 102 వాహనం



వాహనం వద్ద గర్భిణులతో ఆశ కార్యకర్త

ధర్మారం: నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం 102 వాహనాన్ని కేటాయించినట్లు వైద్యాధికారి సుష్మిత తెలిపారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించేందుకు 102 వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆగస్టు 13న కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో మండలంలోని గర్భిణులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి వైద్య పరీక్షల కోసం 102 వాహనం కావాలని కోరిన వెంటనే కలెక్టర్ వాహనాన్ని కేటాయించటం హర్షణీయమన్నారు.

కాట్నపల్లిలో వైద్యశిబిరం

సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లి గ్రామంలో గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

కస్తూర్బా బాలికల పాఠశాల తనిఖీ



రామగిరి: పన్నూర్ గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను సోమవారం ఎంపీడీవో శైలజారాణి తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతిపై విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న వంటలు, కూరగాయలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. బియ్యం నాణ్యత పరిశీలించారు. ఎంపీవో ఉమేశ్, స్పెషల్ ఆఫీసర్ మంజు పాల్గొన్నారు.

సమాజ సేవ అలవర్చుకోవాలి

జ్యోతినగర్: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్క విద్యార్థి సమాజ సేవ అలవర్చుకోవాలని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రిన్సిపాల్ జ్ఞానచంద్ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఎన్‌సీసీ డే పురస్కరించుకొని మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితి ఉచిత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

జూలపల్లి: ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం పెద్దాపూర్‌లోని ఆదర్శ విద్యాలయంలో విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పించారు. కెరీర్ గైడ్ కిశోర్‌బాబు మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు.

ఆధ్యాత్మికం

గంట వితరణ

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద గల కట్ట మైసమ్మ ఆలయానికి పోగుల స్వప్న–మహేశ్ దంపతులు పెద్ద గుడి గంటను సోమవారం అందించారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

గోదావరిఖనిటౌన్: గీతా జయంతి సందర్భంగా గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీకోదండ రామాలయంలో పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత కంఠస్త శ్లోకాల పోటీలు నిర్వహించారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

బ్రహ్మోత్సవాలకు విరాళం

పాలకుర్తి: వేంనూర్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడో వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ దాత, ఎన్ఆర్‌ఐ పోతురాజుల అంబికా–రాధాకిషన్‌తోపాటు వారి కుమారుడు చక్రధర్ రూ.60వేలను ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులకు అందించారు.

ఆలయంలో పూజలు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస సోమవారం ప్రత్యేక పూజలను ఆలయ పునర్నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి నిర్వహించారు. భక్తులకు అన్నదాన చేశారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో..

సుల్తానాబాద్: స్థానిక శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ఉత్తర నక్షత్ర పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ఆలయ కమిటీ శాశ్వత గౌరవ అధ్యక్షుడు శనిగరపు శంకరయ్య, గురుస్వాములు మిట్టపల్లి మురళీధర్, మాటేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ అయ్యప్పస్వామి, గౌతమినగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయాల్లో సోమవారం అర్చకులు పూజలు చేశారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మహా పూర్ణాహుతి నిర్వహించారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి సబ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే సుమారు 14 గ్రామాలకు మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని అంతర్గాం మండల ట్రాన్స్‌కో ఏఈ ఆశ శంకర్ తెలిపారు.

నేడు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

ఎలిగేడు: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ఏవో ఉమాపతి తెలిపారు.

నేడు గ్రామసభ

పాలకుర్తి: బసంత్‌నగర్‌లో మంగళవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి గంగాలక్ష్మి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగే ఈ సమావేశానికి గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీవో సుదర్శన్ హాజరవుతారన్నారు.

క్రైం కార్నర్

దొంగలను పట్టుకుంటాం

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన సాగి అంజలి ఇంట్లో దొంగతనం చేసినవారిని కొద్ది రోజుల్లోనే పట్టుకుంటామని గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు అన్నారు. ఇల్లు, చుట్టుపక్కల పరిసరాలను సోమవారం ఎస్సై ప్రసాద్, సీసీఎస్ ఎస్సై మామిడాల చంద్రశేఖర్, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జైలు శిక్ష

రామగిరి: గుడుంబా అమ్మకాలు చేస్తూ పట్టుబడిన కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన మహిళకు జైలు శిక్ష విధించినట్లు మంథని ఎక్సైజ్ సీఐ రాకేశ్‌కుమార్ తెలిపారు. ఆ మహిళ గతంలో గుడుంబా అమ్ముతూ పలుమార్లు పట్టుబడగా.. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి గ్రామానికి చెందిన తూడి కుమార్(40) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం.. అనారోగ్యానికి గురైన కుమార్ చికిత్స కోసం అప్పులు చేశాడు. ఆరోగ్యం నయం కాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక అనారోగ్యం బాధ భరించలేక ఈనెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శ్రేయ, కుమారుడు మహాదేవ్ ఉన్నాడు.

బొగ్గు లారీ బోల్తా

సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై సోమవారం తెల్లవారుజామున బొగ్గు లారీ అదుపుతప్పి బోల్తా పడగా.. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న క్రమంలో లారీ బోల్తా పడిందని, వెంటనే జేసీబీ సాయంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించామన్నారు.

సమగ్ర సర్వే ఆన్‌లైన్



ఓదెలలో ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఆన్‌లైన్ చకచక కొనసాగుతోంది. సోమవారం మండలంలోని 22 గ్రామాల కుటుంబాల వివరాలను 10 మంది సూపర్‌వైజర్లు, 102 మంది ఎన్యుమరేటర్లు ఆన్‌లైన్ చేస్తున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా కంప్యూటరీకరణ చేయాలని ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు.

రామగిరి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ తీరును సోమవారం మంథని డీఎల్‌పీవో సతీశ్ పరిశీలించారు.

దేశవ్యాప్త నిరసన జయప్రదం చేయండి

సుల్తానాబాద్: ఈనెల 26న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి ముత్యంరావు కోరారు. సోమవారం పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు.



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని రహదారి వెంబడి ఇసుక ట్రాక్టర్లు పైన కవర్ కప్పుకోకుండా వెళ్తున్నారు. దీంతో వెనక వస్తున్న వాహనదారుల కళ్లల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ట్రాక్టర్‌పై కవర్ కప్పుకునేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే జరిమానా విధించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రావణ్‌కుమార్, ఎస్సై, సెల్ నం.: 8726556511

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346608, 9849971500

సింగరేణి వార్తలు

పర్సనల్ డీజీఎంకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: పర్సనల్ మేనేజర్ నుంచి డీజీఎం పదోన్నతి పొందిన డి.కిరణ్‌బాబును పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఆయన కార్యాలయంలో సోమవారం సన్మానించారు. పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవోలు శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, ఆఫీస్ పీవో దేవాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే ఊరుకునేది లేదు

గోదావరిఖని: కార్మికులను యాజమాన్యం వేధిస్తే ఊరుకోబోమని ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. సోమవారం జీడీకే–5 ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నాయకులు గండ్ర దామోదర్‌రావు, గడ్డం కృష్ణ, జనగామ శ్రీనివాస్, కైలాసకోటి శ్రీనువాస్, పోతరవేని సమ్మయ్య, మండల రమేశ్, కందికట్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతన ఖాతాలు తెరవడానికి సహకరించండి

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో వివిధ గనులు, విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు, ఒప్పంద ఉద్యోగులకు వేతన ఖాతాలు తెరవడానికి సహకరించాలని జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ గనులు, విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత విభాగాధిపతులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ప్రాజెక్టు అధికారి రమేశ్, విభాగాధిపతులు రాజేంద్రకుమార్, సుదర్శనం, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గోదావరిఖని: యూనిట్ రేట్ పద్ధతిన అద్దె వాహనాలు సంస్థలో నడిపేందుకు టెండర్లు స్వీకరించనున్నట్లు ఆర్జీ–2 జీఎం వెంకటయ్య పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల డిపెండెంట్లు, ప్రభావిత గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జైపూర్ థర్మల్ ప్లాంట్ సందర్శన

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా సెక్టర్–2 సింగరేణి పాఠశాల విద్యార్థులు సోమవారం జైపూర్ థర్మల్ ప్లాంట్‌ను సందర్శించారు. విజ్ఞాన, విహార యాత్రలో భాగంగా సందర్శనకు వెళ్లారు.

నాణ్యమైన బొగ్గు అందించాలి

గోదావరిఖని: సంస్థ ఉజ్వల భవిష్యత్ కోసం నాణ్యమైన బొగ్గు సరఫరా చేసి వినియోగదారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ సుభాష్ బొగ్గు నాణ్యత అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ప్రాజెక్టు అధికారి ఎస్.మధుసూదన్, ఎస్‌ఓటూ జీఎం ఎం.రాముడు, ప్రాజెక్టు ఇంజినీర్ రాజాజీ పాల్గొన్నారు.

నియామకం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా యాకయ్య



జ్యోతినగర్: సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా వై.యాకయ్యను నియమిస్తూ రాష్ట్ర కమిటీ సభ్యులు మూడో మహాసభలో తీర్మానం చేశారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ శ్రీలక్ష్మీకేశవ ఫంక్షన్ హాల్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరిగిన జిల్లా మూడో మహాసభలో పలు తీర్మానాలు చేశారు. భవిష్యత్తు కర్తవ్యాల రూపకల్పన చేశామని రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ తెలిపారు. ఐదుగురితో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం, మొత్తం 15 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ(ఎ) జిల్లా కమిటీ కార్యదర్శిగా వై.యాకయ్య, కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎరవెల్లి ముత్యంరావు, ఎ.మహేశ్వరి, వేల్పుల కుమారస్వామి, ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యులుగా జ్యోతి, గణేశ్, కొమురయ్య, మెండే శ్రీనివాస్, సారయ్య, నాంసాని శంకర్, రవీందర్, అశోక్, సీహెచ్ శైలజ, భిక్షపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూమిలో చర్చి నిర్మాణంపై ఫిర్యాదు

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రభుత్వం నిరుపేదలకిచ్చిన స్థలంలో ప్రార్థన మందిరం పేరుతో అనుమతి లేకుండా నిర్మించిన చర్చిని వెంటనే తొలగించాలని కోరుతూ జూలపల్లి గ్రామస్తులు తహసీల్దార్ స్వర్ణకు వినతి పత్రం అందజేశారు.

చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్: జూలపల్లి గ్రామానికి చెందిన గుర్రాల అర్జున్‌కు కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి సోమవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అర్జున్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. చికిత్స కోసం ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేట గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు నిమ్మ స్వాతి బీటెక్, సిరికొండ హారిణి ఎంబీబీఎస్ విద్యాభ్యాసానికి గ్రామానికి చెందిన ఎన్ఆర్‌ఐ పచ్చిక రేవంత్‌రెడ్డి తన మిత్రులు, తల్లిదండ్రుల ద్వారా రూ.50వేల చొప్పున సోమవారం ఆర్థిక సాయమందించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, రామిడి తిరుపతిరెడ్డి, సబ్బని రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలుగా ఉన్న ఇద్దరు అక్కాచెల్లెలు ధర్మారపు శివాని, శిల్పానికి వీహెచ్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి హరీశ్‌రెడ్డి రూ.15వేల ఆర్థిక సాయం చేశారు.

కళా ప్రదర్శన

కాల్వశ్రీరాంపూర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా, పెగడపల్లి, ఊశన్నపల్లె, గంగారం గ్రామాల్లో సోమవారం తెలంగాణ సాంస్కృతిక కళాబృందం కళాకారులు ప్రదర్శన నిర్వహించారు.